క్లుప్తంగా

వీవీలను విధుల్లోకి తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న వీవీలు

దహెగాం: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసిన విద్యా వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వీవీల సంఘం మండల అధ్యక్షుడు కంబాల నరేందర్ అన్నారు. మంగళవారం వీవీలు స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. 2020 మార్చి కరోనా సమయంలో విధుల్లోంచి తొలగించారని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సత్యనారాయణ, విశ్వనాథ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న అధికారులు'


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

రెబ్బెన: టర్మినేట్ అయిన ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకొని జిల్లాలో విద్యా వ్యవస్థను అధికారులు భ్రష్టు పట్టిస్తున్నారని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కాగజ్‌నగర్‌లోని కేజీబీవీల్లో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారన్నారు. అయితే తొలగించిన ఉద్యోగులకు జిల్లాలోని ఇతర మండలాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పోస్టింగ్ ఇస్తూ ఈనెల 8న విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయడం దారుణమని పేర్కొన్నారు. విధుల్లోకి తీసుకునేందుకు ప్రోత్సహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల ఉపాధ్యక్షుడు వంశీ, నాయకులు తిరుపతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న అర్షద్ హుస్సేన్ పాదయాత్ర

బెజ్జూర్: బహుజన రాజ్యస్థాపన కోసం పల్లెపల్లెకు బీఎస్పీ.. ప్రగతి భవన్‌కు ఆర్‌ఎస్పీ నినాదంతో బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్ చేపట్టిన పాదయాత్ర కొనసాగుతోంది. మంగళవారం మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామంలో పాదయాత్ర చేపట్టారు. బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ సభ జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: అంగన్‌వాడీ రాష్ట్ర జీపుజాత సందర్భంగా ఈనెల 17న ఆసిఫాబాద్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం జీపుజాత పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ రక్షణ కోసం ప్రభుత్వం పనిచేయాలని, అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు తెలుగు, ఆంగ్లం, గణితం, రసాయన శాస్త్రం సబ్జెక్టులు, 6 నుంచి 10వ తరగతి హిందీ బోధించుటకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వేతనం నెలకు రూ.18,200 ఉంటుందన్నారు. భాషేతర పోస్టులకు ఆంగ్ల మాధ్యమంలో బోధించాల్సి ఉంటుందని తెలిపారు.

వీవీప్యాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ రాజేశం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంలను వివిధ రాజకీయ పార్టీ నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ రాజేశం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రత కోసం పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా ఈవీఎంలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల పనితీరు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఈవీఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్, డీసీసీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, బీఆర్‌ఎస్ నాయకులు గాదెవేణి మల్లేశ్, ఇతర పార్టీల నాయకులు ఉన్నారు.

పెట్టుబడి సాయం కోసం!

- కొత్త వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- త్వరలో రైతుబంధు నగదు జమ
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు


రైతుబంధుకు దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

కౌటాల: ఈ ఖరీఫ్‌లో అన్నదాతలకు పెట్టుబడి సాయం కోసం రైతుబంధు అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు 2018 –19 నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఏటా రెండు పంటల కాలాలకు పెట్టుబడిగా ఎకరానికి రూ.10 వేల చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తోంది. ఈ సాయంతో రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో వానాకాలం సాగు ప్రణాళికను ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. మొత్తం 4.40 లక్షల ఎకరాల్లో పత్తి, కంది, వరి, పెసర, సోయా, జొన్న, మొక్కజొన్న పంటల సాగు అంచనా వేశారు. ఇందుకు ఎరువులు, విత్తనాల అవసరాన్ని సైతం గుర్తించారు. ప్రస్తుతం కొత్తగా పట్టాలు పొందిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో వ్యవసాయ శాఖ అధికారులు అర్హులైన రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెవెన్యూ శాఖలో భూ సమస్యలు పరిష్కరిస్తూ పట్టాపాసు పుస్తకాలను జారీ చేస్తుండటం నిరంతర ప్రక్రియ. ప్రతీ పంట సీజన్‌లో కొత్తగా పట్టాలు పొందిన రైతులకు రైతుబంధు మంజూరు చేస్తున్నారు. జిల్లాలో కొత్తగా పట్టాలు పొందిన వారు వానాకాలం రైతుబంధు కోసం దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో 2027 మంది రైతులు పట్టాలు పొందినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ రైతు బంధు పోర్టల్‌లో వివరాలు పొందుపరిచారు. దీంతో వారంతా సంబంధిత ఏఈవోలను సంప్రదించి పెట్టుబడి సాయం కోసం దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. అర్హులైన రైతులు బ్యాంకు ఖాతా, ఆధార్, పట్టాపాసు పుస్తకం జిరాక్స్ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

కౌలు రైతుకు అందని సాయం

రైతుబంధు పథకాన్ని వ్యవసాయ భూమి ఉన్న వారికి మాత్రమే అందజేస్తున్నారు. కౌలు రైతులకు ఈ పథకం వర్తించడం లేదు. పట్టాదారులకు రైతు బంధు నగదు అందించినా కౌలు రైతులకు కౌలు ధరలు తగ్గించడం లేదని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూమిని సాగు చేస్తున్న కౌలు రైతులకు సైతం రైతుబంధు వర్తింప చేసి ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి



కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన రైతులకు ఈ ఖరీఫ్ నుంచి రైతుబంధు సాయం అందించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం. కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన వారు ఏఈవోలకు దరఖాస్తులు చేసుకోవాలి. పట్టాపాసు పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు అందించాలి. ఎలాంటి సందేహాలున్న ఏఈవో, వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలి. - పి.రాజేశ్, ఏవో, కౌటాల

పల్లెల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- కౌటాలలో పర్యటన


జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలోని తాటినగర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి భూమిపూజ చేశారు. కౌటాలలోని రైతువేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన పాలన అందించడానికి ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసిందన్నారు. తాటినగర్‌లో రూ.22లక్షల నిధులతో నూతన జీపీ భవనం నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. గుత్తేదారు నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు మెర్పల్లి బ్రహ్మయ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావ్, సర్పంచులు మౌనిశ్, శ్రీనివాస్, రేణుక, రమేశ్, రత్నం సోమయ్య, రాందాస్, ఎంపీటీసీ మనీష్, వసంత్‌రావ్, ఉప సర్పంచ్ తిరుపతి, పార్టీ యూత్ మండలాధ్యక్షులు రవీందర్ గౌడ్, కార్యదర్శులు సాయికృష్ణ, తిరుపతి, నాయకులు మధుకర్, గంగారం, శ్రీనివాస్, సంతోష్, బాపు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కాగజ్‌నగర్‌టౌన్: మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని సంతోష్ ఫంక్షన్‌హాల్‌లో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రుణాలు మంజూరు చేస్తుందన్నారు. దేశంలో, ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా సీఎం కేసీఆర్ మహిళల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కాగజ్‌నగర్ సీడీపీవో సురేఖ రెడ్డి, కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా, మున్సిపల్ కౌన్సిలర్లు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి 'ఎఫ్ఎల్ఎన్'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సెక్టోరియల్ అధికారులు

కెరమెరి: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం ఉపయుక్తంగా ఉంటుందని సెక్టోరియల్ అధికారులు రాథోడ్ సుభాశ్, శ్రీనివాస్, సత్తయ్యలు అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం సెక్టోరియల్ అధికారుల ఆధ్వర్యంలో ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు కార్యక్రమానికి సంబంధించిన జిల్లాస్థాయి పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న తొలిమెట్టు కార్యక్రమ ఉత్తమ బోధన విధానాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టర్లను పాఠశాల గోడలకు అతికించి తల్లిదండ్రులకు, ఎస్ఎంసీ సభ్యులకు కార్యక్రమం ఆవశ్యకతను తెలియచేశారు. కార్యక్రమాల్లో ఎంఈవో సుధాకర్, మండల ప్రత్యేకాధికారి అడె ప్రకాశ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీం విగ్రహావిష్కరణ కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

బెజ్జూర్: కుమురం భీం విగ్రహావిష్కరణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీటీడీఏ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కురిసింగ ఓంప్రకాష్ ఆధ్వర్యంలో మంగళవారం బెజ్జూర్ మండల కేంద్రంలో ఎన్నికలు నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా సిడాం సకారాం, ఉపాధ్యక్షులుగా తోర్రెం బానయ్య, సైతం శంకర్, పెద్దల శంకర్, ప్రధాన కార్యదర్శులుగా కోర్తె తిరుపతి, కొమరం హనుమంతు, సహాయ కార్యదర్శులుగా కోర్తె లాలయ్య, కోర్తె మహేష్, తోర్రెమ్ శంకర్, ప్రచార కార్యదర్శులుగా ఎలాది చంద్రశేఖర్, ఆత్రం అశోక్, కోశాధికారిగా అనిల్, సంయుక్త కార్యదర్శిగా పురుషోత్తం, సలహాదారులుగా ఇంజరి రాజారాం, శంకర్‌లతో పాటు మరో 30 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కమిటీ బెజ్జూర్ మండల కేంద్రంలో కుమురం భీం విగ్రహావిష్కరణ, ఆదివాసీ భవన్ ప్రారంభోత్సవానికి కృషి చేస్తుందన్నారు

గురుకులానికి ఎంపికైన సరాండి విద్యార్థులు

వాంకిడి: 2023 –24 విద్యాసంవత్సరానికి గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షల్లో మండలంలోని సరాండి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించారు. సరాండి ఎంపీపీఎస్ పాఠశాలలో నాల్గో తరగతి పూర్తి చేసుకున్న దుర్గం నితిన్, జాడి వర్షిని, కొట్రంగె క్రిష్ణవేణిలు సీటు సాధించారు. ప్రతీ ఏడాది తమ పాఠశాల నుంచి విద్యార్థులు గురుకులాల్లో సీట్లు సాధిస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్రె వినేష్ మంగళవారం తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని విజేత హాస్పిటల్‌లో బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ ఆర్.విద్యాసాగర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు శిబిరాన్ని ప్రారంభిస్తామని, యువకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

టీఎస్ యూటీఎఫ్ 'కుటుంబ సంక్షేమ నిధి'లో చేరాలి

కాగజ్‌నగర్‌టౌన్: టీఎస్ యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి పథకంలో చేరి ఉపాధ్యాయులు తమ కుటుంబాలకు భరోసా ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ కేజీబీవీని సందర్శించి ఉపాధ్యాయులు ఐకమత్యంగా ఉండాలని సూచించారు. టీఎస్ యూటీఎఫ్ ఒక సామాజిక స్పృహ కలిగిన సంఘంగా ఉపాధ్యాయ కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో కార్యక్రమం ప్రారంభించినట్లు పేర్కొన్నా రు.

ఖాళీ బిందెలతో గ్రామస్తుల ధర్నా


ధర్నా చేస్తున్న చిన్న ఐనం గ్రామస్తులు

దహెగాం: మండలంలోని చిన్న ఐనం గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మంగళవారం గ్రామస్తులు, మహిళలు ఖాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ధర్నాకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తుందని, కానీ తాగునీటి ఇబ్బందులు తీర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ కొన్ని నెలలుగా తాగునీటికి అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యేను కలిసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. మిషన్ భగీరథ నీరు కూడ రావడం లేదని, ప్రతీ గ్రామ పంచాయతీలో వాటర్ ట్యాంకులు ఉన్నా తాగునీటిని ఎందుకు సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోస్ ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్కు మోహన్, చిన్న ఐనం గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు


తనిఖీలు నిర్వహిస్తున్న ఏవో రామక్రిష్ణ

చింతలమానెపల్లి: పంట విత్తనాలను డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో రామక్రిష్ణ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని డబ్బా గ్రామంలో పలు విత్తనాల డీలర్ల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. డీలర్ల వద్ద ఉన్న విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. నాణ్యతను తెలుసుకోవడానికి శాంపిళ్లు సేకరించారు. విత్తన డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే రైతులు వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తే విత్తన డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు దుకాణాలు సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ ఏడీఏ మనోహర్ రావు ఆధ్వర్యంలో ఏవో రామకృష్ణ, సిబ్బంది తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

కామ్రేడ్ శర్మిష్టకు ఘన నివాళి

వాంకిడి: విప్లవ మహిళా యోధురాలు కామ్రేడ్ శర్మిష్ట 2వ వర్ధంతిని మండలంలోని ఖిరిడి గ్రామంలో సీపీఐ (ఎం.ఎల్) రెడ్‌స్టార్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగర్ల తిరుపతి మాట్లాడుతూ పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యురాలిగా శర్మిష్ట అనేక ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. పితృస్వామ్యం నుంచి స్త్రీల విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం మరువలేనిదన్నారు. నాయకులు సదాశివ్, శేఖర్, రామ్, సోమయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బావి నీరు.. బతుకు పోరు


ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో పెంచికల్‌పేట్ మండలం జిల్లెడ గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వేసవికాలంలో తాగడానికి నీరు లేకుంటే బతకడం ఎలా అని గ్రామస్తులు వాపోతున్నారు. బావుల వద్దకు వెళ్లి ఎడ్లబండ్ల ద్వారా నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - పెంచికల్‌పేట్

పల్లెల్లో నిఘా కరువు..!

- పనిచేయని కమ్యూనిటీ కెమెరాలు
- ప్రధాన చౌరస్తాలో నిరుపయోగంగా మారిన వైనం
- ఆందోళనలో మండల వాసులు


పెంచికల్‌పేట్‌లో నిరుపయోగంగా సీసీ కెమెరాలు


పెంచికల్‌పేట్ మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

పెంచికల్‌పేట్: లక్షల రూపాయలు వెచ్చించి పల్లెల్లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ నిఘా నేత్రాలు నిరుపయోగంగా మారాయి. ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన సీసీ కెమెరాలు పోలీసుల సహకారంతో గ్రామాల్లో సైతం విస్తరించాయి. గ్రామాల్లో భద్రతతో పాటు నేరస్తులను గుర్తించేందుకు కీలకంగా మారే సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకు రావడంతో మండలంలోని పెంచికల్‌పేట్, ఎల్లూర్, ఎల్కపల్లి, చేడ్వాయి, పోతెపల్లి, కొండపల్లి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో పోలీసులు ఏర్పాటు చేశారు. గత రెండేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

కేసుల పరిష్కారంలో..

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో గతంలో జరిగిన నేరాలను పోలీసులు చేధించారు. మండల కేంద్రంలోని బిస్వాస్ ఇంట్లో చోరీ జరగ్గా పోలీసులు సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను పరిశీలించి దొంగలను గుర్తించారు. దీంతో పలువురు వ్యాపార సముదాయాలతో పాటు ఇళ్ల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు.

దెబ్బతిన్న వ్యవస్థ..

మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాతో పాటు బెజ్జూర్, కాగజ్‌నగర్, దహెగాం ప్రధాన రహదారుల పైన నిఘా పటిష్టం చేయటానికి మూడేళ్ల క్రితం పోలీసులు 16 సీసీకెమెరాలు ఏర్పాటు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అయితే గడిచిన ఏడాది కాలంగా సీసీ కెమెరాలకు మరమ్మతులు లేకపోవడంతో మండల కేంద్రంలో నిఘా కరువైంది.

నిత్యం రద్దీ..

పెద్దవాగు వంతెన అందుబాటులోకి రావడంతో కాగజ్‌నగర్, బెజ్జూర్, కౌటాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు పెంచికల్‌పేట్ మీదుగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వారితో నేరాలు జరిగే అవకాశం ఉంది. దీంతో మండలవాసులు ఆందోళన చెందుతున్నారు. సీసీ కెమెరాల మరమ్మతులు చేపట్టి నిఘా వ్యవస్థను పటిష్టపరచాలని స్థానికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



మండల కేంద్రం నుంచి నిత్యం అనేక మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. భద్రత కోసం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. కెమెరాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

- రామగిరి మహేశ్, పెంచికల్‌పేట్

స్థానిక ఆదివాసీలతోనే సీఆర్టీ నియామకాలు చేపట్టాలి


మాట్లాడుతున్న మడావి భరత్ భూషణ్

కెరమెరి: స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతోనే సీఆర్టీల నియామకాలు చేపట్టాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భారత్ భూషణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఆర్టీల నియామకాల్లో గిరిజనేతరులకు అవకాశం కల్పిస్తే సహించబోమన్నారు. టెట్‌తో సంబంధం లేకుండా బీఎడ్, డీఎడ్ వారి మెరిట్ ఆధారంగా నియామకాలు చేపట్టాలని కోరారు. సమావేశంలో కోలాం సంఘ నాయకులు మడావి రాజు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను గెలిపించండి'

దండేపల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కోరారు. నెల్కివెంకటాపూర్‌లో మంగళవారం నిర్వహించిన గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.